ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
సోమవారం 1 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 15.4



కొత్త సంవత్సరంలో కోటి ఆశలతో..

అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి కాంగ్రెస్ అధికారంలోకి రాగా, కొత్త సంవత్సరంలో ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. ప్రజాదర్బార్‌తో ప్రారంభమైన కాంగ్రెస్ పాలనలో కొత్త ఏడాదిలో హామీల అమలుతోపాటు ఆకాంక్షలను నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

- కోదాడ

- రూ.3,500కోట్ల రుణమాఫీ కోసం రైతుల ఎదురుచూపు
- పన్నుల సవరింపు కోసం వ్యాపారులు..
- కనీస వేతన చట్టం కోసం అసంఘటితరంగ కార్మికులు

ఉమ్మడి జిల్లాలోని నల్లగొండలో 216 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు, యాదాద్రి జిల్లాలో 98, సూర్యాపేట జిల్లాలో 142 మొత్తం 456 బ్యాంకులు ఉన్నాయి. కాగా, ఆయా బ్యాంకుల్లో రైతులు రూ.2లక్షల లోపు రుణాలు రూ.3,500కోట్ల మేర తీసుకున్నారు. కొత్త ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణమాఫీ చేస్తానని హామీఇవ్వటంతో రైతులు దీనికోసం ఎదురుచూస్తున్నారు.

ఖాళీగా ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు

నూతన ప్రభుత్వం మెగా డీఎస్సీతో పాటు, తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు కొత్త చైర్మన్‌ను నియమించి ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పడంతో నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే గత ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నల్లగొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 86, ఎస్జీ టీ 102, లాంగ్వేజీ 25, పీఈటీ 25 పోస్టులకు, సూర్యాపేట జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 80, ఎస్జీటీ 78, లాంగ్వేజీ 23, పీఈటీ 4, యాదాద్రి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 39, ఎస్జీటీ 38, లాంగ్వేజీ 20, పీఈటీ 20 పోస్టులు మొత్తంగా 403పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా,ఎస్జీటీ పోస్టులకు బీఈడీ విద్యార్థులు అర్హులు కాదని డీఎడ్ విద్యార్థులు కోర్టును ఆశ్రయించడంతో ఈ నియామక ప్రక్రియ నిలిచింది.దీంతో నూతన ప్రభుత్వం ఉపాధ్యాయ నియమకాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలను తొలగించి, పోస్టుల సంఖ్య పెంచి కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో బీఎడ్, ఎంబీఏ, ఫార్మసీ,ఇంజనీరింగ్ కళాశాలలు 2,910ఉండగా, ఆయా కళాశాల నుంచి ఏటా 16,286మంది విద్యార్థులు పట్టాతో బయటకు వస్తున్నారు.ఈ క్రమంలో ఇతర శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీచేయాలని నిరుద్యోగ యువత కోరుతోంది.

నెరవేరని సొంతింటి కల

బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గృహ లక్ష్మీ పథకాన్ని ఎన్నికల ముందు తీసుకువచ్చింది. సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేస్తామని దరఖాస్తులు తీసుకుంది. అయితే కాంగ్రెస్ ఈ మొత్తాన్ని రూ5లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఇప్పటికే 36వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకాన్ని కొత్త ప్రభుత్వం అమలుచేయాలని అర్హులు కోరుతున్నారు.అదే విధంగా మహాలక్ష్మీ పథకం కింది ప్రతీ నెల రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 28వ తేదీ నుంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలనలో భాగంగా అర్హులు దరఖాస్తు చేసుకున్నారు.

పూర్తిస్థాయిలో అమలుకాని 'దళితబంధు'

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలలో గత ప్రభుత్వ హయంలో 13వేల మంది దళిత బంధుకోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉచిత ప్రయాణాన్ని మెరుగుపరచాలి

ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి ఏడు డిపోలు ఉన్నాయి. ఆయా డిపోలలో 647 బస్సులు, నిత్యం 2,50లక్షల కిలోమీటర్లు తిరుగుతూ ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలుచేస్తుండటంతో నిత్యం 2లక్షల మంది మహిళలు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారు. దీంతో బస్సులు మహిళలతో కిక్కిరిస్తున్నాయి. అయితే గ్రామాలతో పాటు, రాష్ట్ర, జాతీయ రహదారులపై బస్సుల సంఖ్య పెంచి ప్రయాణ సౌకర్యాన్ని మరింత మెరుగుపరచాలని మహిళలు కోరుతున్నారు. ఇది ఇలా ఉంటే నిత్యం 80వేల మంది పురుషులు బస్సు ప్రయాణం చేస్తున్నారు. మహిళలతో బస్సులు నిండి ఉండటంతో ప్రయాణం చేయలేకపోతున్నామని, బస్సుల సంఖ్య పెంచాలని వారు అంటున్నారు.

నిలిచిన పదోన్నతులు, బదిలీలు

ఉపాధ్యాయులకు పదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేకపోవడంతో బోధన కుంటుపడుతోందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. ఈనెల 11న సీఎంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో పాటు, ఉన్న త విద్యాశాఖ అధికారులు సమావేశం కానున్నట్టు సమాచారం. ఈ సమావేశంలో పదోన్నతులు, బదిలీలపై స్పష్టతకు వస్తే ఉపాధ్యాయుల్లో ఉత్సాహం నిండుతుంది. ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులు ఉంటే ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంటే వచ్చే విద్యాసంవత్సరం గాడి నపడటమేగాక, విద్యార్థులకు మంచి బోధనతోపాటు, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. అంతేకాక 310జీవోను సరిచేసి, సాంకేతిక సమస్యలను తొలగించి, స్పౌజ్ బదిలీలు కూడా చేపట్టాలని కోరుతున్నాయి.

ఉచిత విద్యుత్, ధర

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా 200యూనిట్లలోపు విద్యుత్ బిల్లు ఎత్తివేసి గృహ వినియోగదారులకు లబ్ధిచేకూర్చాల్సి ఉంది. వరి, కందులు, ఇతర పంటలకు మద్దతు ధర ప్రకటించి యాసంగిలో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పన్నులు తగ్గిస్తే వస్తువు ధర తగ్గుతుందని, ఫలితంగా విక్రయాలు పెరిగే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. కనీస వేతన చట్టాన్ని సవరించాలని అసంఘటితరంగ కార్మికులకు కోరుతున్నారు.

విడుదల కాని ఉపకార వేతనాలు

ఉమ్మడి జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు 2021-22, 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.80కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్ ఉన్నాయి. ఈ విద్య సంవత్సరంలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థికి సంబంధించిన మొదటి ఏడాది బకాయి నేటికీ విడుదల కాలేదు. అంతేగాక 2023-24 విద్య సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సి ఉంది. పాత బకాయిలు విడుదల చేయకపోవటంతో విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇచ్చేప్పుడు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతుండటంతో పైచదువులకు దూరమవుతున్నారు. నూతన ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులు గుర్తించి, వెంటనే ఉపకార వేతనాలను విడుదల చేయాలని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలి

రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నూతన సంవత్సరంలో నెరవేరాలి. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తాం. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజల ఆర్థిక అభివృద్ధికి దరఖాస్తులను తీసుకుంటోంది. అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలుచేస్తాం. నూతన సంవత్సరంలో ప్రజలంతా సంతోషంగా ఉండాలి. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలి

రాష్ట్రంలోని ప్రతీ కుటుంబంలో నూతన సంవత్సరంలో ఆనందం వెల్లివిరియాలి. ప్రతీ ఒక్కరు కొత్త ఏడాదిలో సుఖ సంతోషాలతో ఉండాలి. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి

జిల్లా అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

జిల్లా అభివృద్ధికి అధికారులు, సిబ్బంది కలిసి పనిచేద్దాం. అధికారులు మరింత బాధ్యతగా విధులు నిర్వహించి ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలి. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటీలను సమర్థంగా అమలు చేసేందుకు కృషి చేయాలి. ప్రజలందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు.

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

● న్యూ ఇయర్ సందడి

2023 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ నూతన సంవత్సరం 2024కు స్వాగతం పలుకుతూ ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఏనుబాముల గ్రామానికి చెందిన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం వినూత్నంగా ప్రదర్శన చేశారు. 2024 ఆకృతిలో విద్యార్థులు ఒదిగి ఆకట్టుకున్నారు.

- ఆత్మకూర్ (ఎస్)



నూతన సంవత్సరం 2024 ఆకృతిలో విద్యార్థులు

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 31: అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. జిల్లాలో పట్టభద్రుల స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 6వతేదీ వరకు ఉంటుందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ఫిబ్రవరి 2వ తేదీన ప్రకటించి అదేరోజు నుంచి మార్చి 14వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే అభ్యంతరాల పరిష్కారం మార్చి 29వ తేదీ వరకు చేసి తదుపరి ఓటర్ల తుది జాబితా ఏప్రిల్ 4వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. జిల్లాలో 2023, నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రీ పూర్తయి మూడేళ్లు నిండిన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

వచ్చే సీజన్‌కు ఎత్తిపోతల పథకాలు సిద్ధం



ఎత్తిపోతలను పరిశీలిస్తున్న సీఈ రమేష్‌బాబు

ఎన్నెస్పీ సీఈ రమేష్‌బాబు

మేళ్లచెర్వు, పాలకవీడు, డిసెంబరు 31: వచ్చే వానాకాలం సీజన్ నాటికి కృష్ణానదిపై పాత, కొత్త ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని ఎన్నెస్పీ సీఈ రమేష్‌బాబు అన్నారు. చింతలపాలెం మండల పరిధిలోని ఎత్తిపోతల పథకాలను ఆయన వరుసగా రెండోరోజు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలను పరిశీలిస్తున్నామని, వాటిలో ఉత్తమ్‌పద్మావతి ఎత్తిపోతలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు రూ.7.4కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. నక్కగూడెం పథకం, పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి ముందుగా నిర్మించినందున బ్యాక్ వాటర్‌లో మునిగిపోయిందని, దాని పునర్నిర్మాణం కోసం రూ.41కోట్లు, బిట్టుతండా పథకానికి రూ.36.4కోట్లు, రెడ్లకుంట గ్రామంలో మున్నేరు వాగుపై నిర్మించే నూతన పథకానికి రూ.44.60 కోట్లు అవసరం అవుతాయన్నారు. వెల్లటూరులోని శివగంగ, గుల్లపల్లి ఎత్తిపోతల పథకాలు పాక్షికంగా నడుస్తున్నాయని, వాటికి తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి ఈ సీజన్‌లో పూర్తిస్థాయి వినియోగంలోకి తెస్తామన్నారు. దొండపాడు వద్ద నూతన ఎత్తిపోతల పథకానికి సర్వే నిర్వహిస్తామని, దీని ద్వారా ఒకే లైన్లో రెండు పైప్ లైన్లు వేసి, రామాపురం ఎస్ఎస్పీ కాల్వలోకి ఒక కాల్వను. రామాపురంలోని గోపాలరావు చెరువుకు రెండోలైన్‌ను ఏర్పాటుచేస్తామన్నారు.

తమ్మారంలో నూతన లైన్ కోసం సర్వే నిర్వహించి మంత్రికి నివేదిక అందిస్తామన్నారు. ఎత్తిపోతల పథకాలపై రైతుల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని, పెద్ద లైన్లు కాకుండా, చిన్న చిన్న లైన్లతో మంచి ఫలితాల వస్తాయని మంత్రి సూచించారని తెలిపారు. ఎత్తిపోతల పథకాల ఆపరేటర్లను ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తుందని, వీటి పైప్‌లైన్లను ఎవరైనా ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎన్నెస్పీ డీఈ స్వామి, ఏఈ శ్రీనివాసరావు, ఈఈ నర్సింహారావు, కొట్టే సైదేశ్వరరావు, ఇందిరారెడ్డి, నాగిరెడ్డి, జడ్పీటీసీ మాలోతు బుజ్జీ మోతీలాల్, మాలోతు హతిరాం, నగేష్, వినోద్, శ్రీను, రమణ, కిషన్, కృష్ణా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో 3లక్షలకుపైగా

దరఖాస్తులు

రేపటి నుంచి తిరిగి దరఖాస్తుల స్వీకరణ

పాత లబ్ధిదారులకు యథావిధిగా పథకాలు

భువనగిరి అర్బన్, నల్లగొండ, డిసెంబరు 31: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు సంబంధించి స్వీకరిస్తున్న దరఖాస్తులు మూడు రోజుల్లో 3లక్షలకు పైగా వచ్చాయి. గత నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న విషయం విదితమే. ఆది, సోమవారం సెలవు ఉండటంతో 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఐదు రోజుల పాటు 'ప్రజాపాలన'లో భాగంగా ఇందిరమ్మ అభయహస్తానికి సంబంధించిన దరఖాస్తులను అధికారులు తీసుకోనున్నారు. దరఖాస్తులను అంచనా వేయడంలో కొంత సమస్య ఏర్పడటంతో పలుచోట్ల దరఖాస్తుల కొరత ఏర్పడింది. దీంతో ఆయా గ్రామాల్లో మళ్లీ దరఖాస్తులు తీసుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గతంలో రైతుబంధు, పింఛన్లు పొందుతున్నవారు దరఖాస్తు చేయాలా వద్దా అనే సందేహంలో ఉండగా, వారికి యథావిధిగా పథకాలు అమలవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎలాంటి పథకాలు అందని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో గందరగోళానికి తెరపడింది. దీంతో 2వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల్లో 3,02,311 దరఖాస్తులు వచ్చాయి. నల్లగొండ జిల్లాలో 1,34,438 దరఖాస్తులు రాగా, సూర్యాపేట జిల్లాలో 1,00,792, జిల్లాలో 67,081 దరఖాస్తులు వచ్చాయి.

ఆసియా పోటీలకు

నేరేడుచర్ల క్రీడాకారుడు



వెండి పతకంతో గమన్‌రెడ్డి

నేరేడుచర్ల, డిసెంబరు 31: చన్‌హంగ్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఫెడరేషన్ నిర్వహించిన జాతీయ పోటీల్లో నేరేడుచర్లకు చెందిన కొణతం గమన్‌రెడ్డి అండర్-20 కిలోల విభాగంలో వెండి పతకం సాధించి ఆసియా పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 30న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రేపల్లెలో నిర్వహించిన జాతీయ పోటీల్లో వెండి పతకం సాధించాడు. జనవరి 8నుంచి 10 వరకు మూడు రోజుల పాటు నేపాల్‌లో జరగనున్న ఆసియా పోటీల్లో అతడు పాల్గొననున్నాడు. కాగా, ఆసియా పోటీలకు ఎంపికవడంపై తండ్రి ఉదయ్‌కుమార్‌రెడ్డి, కోచ్ సైకం సుబ్బారావు, మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్, డిసెంబరు31: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో వరుస సెలవుదినాలతోపాటు సంవత్సరాంతంకావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి నూతన సంవత్సర వేడుకలు సాగర్‌లో జరుపుకోవడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో సాగర్‌కువచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయవిహార్, అనుపు, ఎత్తిపోతల తదితర ప్రాంతాలల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు హిల్ కాలనీ విజయవిహార్ అతిథి గృహం వెనుక వైపున ఉన్న పర్యాటకశాఖ లాంచీ స్టేషన్ నుంచి మూడు లాంచి ట్రిప్పులు నడిపినట్లు అధికారులు తెలిపారు.

స.హ చట్టంపై ప్రచారం చేపట్టాలి

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 31: సమాచారం హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహించాలని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు అన్నారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగం, పాలనలో పారదర్శకత వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు.

కేక్‌కోసం వెళ్లి కానరాని లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి



గీతారెడ్డి(ఫైల్)

మఠంపల్లి, డిసెంబరు 31: కేక్‌కోసం వెళ్లిన ఓ విద్యార్థిని కానరాని లోకాలకు వెళ్లింది. వివరాల్లోకి వెళితే సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన గాయం మధుసుధన్‌రెడ్డి మల్లేశ్వరీ దంపతుల కుమార్తె గీతారెడ్డి(14). చిన్నపట్టినుంచే తాతయ్యా-నాయనమ్మలు వద్ద ఉంటూ చదువుకుంటోంది. గీతారెడ్డి మఠంపల్లి మాన్‌ఫోర్టు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గీతారెడ్డి ఆదివారం న్యూ ఇయర్ వేడుకలకు కేక్ తెచ్చుకుందామని తాత, సోదరుడు గోపిరెడ్డితో కలిసి రాత్రి ద్విచక్రవాహనంపై మఠంపల్లికి బయలుదేరారు. చౌటపల్లి-ప్రధాన రహదారిపై నుంచి మఠంపల్లి వైపు వస్తున్న వారి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి లారీ అతివేగంగా ఢీ కొట్టడంతో రోడ్డుపై గీతారెడ్డి, రోడ్డు పక్కన కృష్ణారెడ్డి, గోపిరెడ్డి పడ్డారు. ప్రధాన రహదారిపై పడిన గీతారెడ్డిపై నుంచి ఢీకొన్న లారీ టైర్లు వెళ్లడంతో శరీర భాగం నుజ్జునుజ్జయి అక్కడిక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబరాన్నంటిన సంబురాలు

● వెల్‌కమ్ టు 2024 ● బాణాసంచాల మోత ● జోష్‌లో యువత ● కేక్ కటింగ్‌లు, స్వీట్ల పంపిణీ ● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ● నేడు భక్తులతో కిటకిటలాడనున్న దేవాలయాలు





నల్లగొండలో బేకరీల్లో, రంగుల దుకాణం వద్ద వినియోగదారుల రద్దీ



భువనగిరిలో మద్యం దుకాణం వద్ద..



హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్.. విష్యూ హ్యాపీ న్యూ ఇయర్.. అంటూ జరిపిన వేడుకలు జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. చిన్న పిల్లల నుంచి మొదలుకుని పెద్దలవరకు శనివారం అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. గత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ గడచిన సంవత్సరం విశేషాలను నెమరు వేసుకుంటూ రాబోయే సంవత్సరం హ్యాపీగా గడవాలని కాంక్షిస్తూ సంబురాలు చేసుకున్నారు.

నల్లగొండ కల్చరల్, మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి

కోటి ఆశల కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. న్యూ ఇయర్ కేకును కట్ చేసి స్వీట్లను పంచుకుంటూ వినోదాలతో సరదాగా ఆనందంగా గడిపారు. అర్ధరాత్రి కాగానే నల్లగొండ జిల్లాకేంద్రంలోని వివిధ పార్టీ కార్యాలయాలు, అధికారుల బంగ్లాలు, ఇళ్లలో న్యూఇయర్ వేడుకలు అంబరాన్ని తాకాయి. యువకులు ద్విచక్ర వాహనాల మీద పట్టణంలో తిరుగుతూ హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ స్నేహితులను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపి సరదాగా గడిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో న్యూఇయర్ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరిపారు. కలెక్టర్ బంగ్లాలో ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కుటుంబసభ్యులు, ఇతర రెవెన్యూ అధికారులు, ఎస్పీ బంగ్లాలో ఎస్పీ తన కుటుంబసభ్యులతో, పోలీసు అధికారులతో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకులను కట్ చేసి స్వీట్లను పంచుకుని ఆటపాటలతో గడిపారు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల గృహాల్లో తమ కార్యకర్తలతో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరిగాయి. అదే విధంగా పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో గల స్వపోషణ తెలుగు బాప్టిస్టు చర్చిలో ఫాదర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి క్యాండిల్స్ వెలిగించి న్యూ ఇయర్ వేడుకలను జరిపారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా మిషన్ కాంపౌండ్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో కూడా వేడుకలు జరిగాయి. దేవరకొండ రోడ్‌లోని మరియరాణి కెథెడ్రల్ చర్చిలో ఫాదర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఇళ్ల ముంగిట న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ వివిధ రంగులతో అందంగా ముగ్గులు వేశారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో ప్రత్యేకంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు మధ్య రాత్రి వరకు అనుమతించటంతో సందడిగా మారాయి. అమ్మకాలు ముమ్మరంగా సాగాయి. మందు ప్రియులకు, రెస్టారెంట్లు, బార్లు తెరిచి ఉండడంతో వారు ఎంజాయ్ చేశారు. పట్టణ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ తిరుగుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం సాయంత్రం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని బేకరీల యజమానులు ప్రత్యేక ఆఫర్లు ఇవ్వటంతో ప్రజలు వాటిని భారీగా అమ్మకాలు చేశారు. వివిధ రంగులను కూడా షాపుల యజమానులు భారీగానే అమ్మారు. పట్టణమంతా విద్యుత్ కాంతులతో విరాజిల్లుతూ కొత్త సంవత్సరానికి శోభనిచ్చే విధంగా స్వాగతం పలికింది. న్యూ ఇయర్ సందర్భంగా సోమవారం దేవాలయాలు భక్తులతో సందడి చేయనున్నాయి.

సందడిగా మారిన పల్లెలు

2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వివిధ వర్గాల ప్రజలు ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు ఆదివారం (డిసెంబర్ 31న) ఉత్సాహంతో సందడిచేశారు. మోత్కూరు మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో కొత్త సంవత్సరం సందర్భంగా విందులు, వినోదాలతోపాటు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపేందుకు కేక్‌లు కొనుగోలు చేయడంతో బేకరీల్లో న్యూఇయర్ కేక్‌ల అమ్మకాలు జోరుగా సాగాయి. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో సైతం న్యూ ఇయర్ వేడుకలపై ఉత్సాహం చూపుతున్నారు. ఆదివారం రాత్రి విందులు, వినోదాలతో అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండి 12 దాటగానే కేక్‌కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విక్రయాలు పెంచుకునేందుకు బేకరి యాజమానులు కేక్‌ల ధరలు తగ్గించి ఆఫర్లు ప్రకటించారు.

జోరుగా మాంసం విక్రయాలు



2023 సంవత్సరానికి వీడ్కోలు, 2024 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు చిన్నా, పెద్దా తేడా లేకుండా విందులు చేసుకోవడంతో ఆదివారం మోత్కూరులో మద్యం, మాంసం, చికెన్ విక్రయాలు జోరుగా సాగాయి. మటన్, చికెన్ షాపుల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. ఆయా షాపులు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.



భువనగిరిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు



నల్లగొండలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న యువతులు

యాదగిరిక్షేత్రంలో భక్తుల కోలాహలం

● సందడిగా ఆలయ తిరువీధులు..సేవా మండపాలు ● కిటకిటలాడిన ఉభయ దర్శన క్యూలైన్లు



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకారంలో స్వామివారు

యాదగిరిగుట్ట, డిసెంబరు31: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం యాత్రాజనుల కోలాహలం నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా దేవదేవుడి దర్శనాల కోసం తరలివచ్చారు. భక్తజనుల హరిహరుల నామస్మరనలతో క్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది. ఆలయ తిరువీధులు, ఆర్జిత సేవా మండపాలు భక్తనులతో కోలాహలంగా కనిపించాయి. ఉభయ దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల విక్రయశాల వద్ద క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉభయ దర్శనాల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచివుండి కొండగుహలో కొలువైన ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. స్వామివారి ధర్మదర్శనాలలో సుమారు 3గంటలు..ప్రత్యేక దర్శనాలలో గంట సమయం పట్టిందని, సుమారు 35 వేల మంది భక్తులు దేవదేవుడిని దర్శించుకున్నట్లు, ఆలయియ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.42,00,353 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. యాదగిరిక్షేత్రంలో ఆదివారం స్వామికి నిత్యారాధనలు, దనుర్మాసోత్సవాలు ఆగమ శాస్త్రరీతిలో ఘనంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను, ప్రతిష్టా అలంకారమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసి దళాలతో అర్చనలు జరిపారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

యాదగిరీశుడిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి వినోద్‌కుమార్, విజయసేన్‌రెడ్డిలు వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఆలయ వేళల్లో మార్పు

ఆంగ్ల నూతన సంవత్సరం జనవరి 1వ తేదీ సోమవారం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించనున్నారని, ఇందుకోసం ఆలయ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఈవో రామకృష్ణారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అరగంట ముందుగానే ఉదయం 3గంటలకు ఆలయాన్ని తెరిచి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహిస్తారని, ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు స్వామికి సేవోత్సవాలు, నివేదనలు, బ్రేక్ దర్శనాల సమయాలను మినహాయించి మిగతా సమయాల్లో భక్తులందరికీ ఉభయదర్శనాల సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రమాదానికి కారణమైన నిందితుల అరెస్టు

నిడమనూరు, డిసెంబరు 31: అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురు వ్యక్తులు చనిపోవడానికి కారణమైన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా హాలియా సీఐ గాంధీనాయక్, నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు. డిసెంబరు 24న మండలంలోని వేంపాడ్ స్టేజీ సమీపంలో టాటా ఏస్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అందులో ఉన్న పెద్దవూర మండలం మల్లెవానికుంట తండా, పుల్యాతండాలకు చెందిన నలుగురు వ్యక్తులు రమావత్ గన్యా, బుజ్జి, నాగరాజు, పాండునాయక్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనపై నిడమనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ప్రమాదానికి కారణమైన లారీ యజమాని ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన తోట దుర్గారావు, గోకవరం మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన డ్రైవరు కలిశెట్టి శ్రీను, గోకవరం మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన క్లీనర్ పేరారపు జయప్రకాష్ నిందితులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో క్లీనర్ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే లారీ నడిపినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవరు లైసెన్స్ కూడా వాలిడిటీ ముగిసినట్లు తెలిపారు.


ప్రయాణికుడి బ్యాగు నుంచి చోరీ



బ్యాగును చూపుతున్న హరికిషన్

మోత్కూరు, డిసెంబరు 31: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుని బ్యాగు నుంచి రూ.40 వేలు చోరీకి గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుని కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలం సీతారాంపురం గ్రామ రేషన్ డీలర్ గుండు హరికిషన్ శనివారం (డిసెంబరు 30న) మధ్యాహ్నం హైదరాబాదు నుంచి మోత్కూరు రావడానికి ఉప్పల్ రింగ్‌రోడ్డులో బస్ స్టాప్ వద్ద యాదగిరిగుట్ట డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు (టీఎస్30 9119) ఎక్కాడు. బస్ ఎక్కేటప్పుడు ఆయన బ్యాగు భుజానికి తగిలించుకుని వీపునకు ఉండేలా పెట్టుకున్నాడు. మోత్కూరులో బస్సు దిగుతుండగా ఓ ప్రయాణికుడు తన బ్యాగు కట్ చేసి ఉందని చెప్పడంతో బ్యాగుతెరిచి చూస్తే అందులోని రూ.40వేలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీంతో ఆయన ఆదివారం ఉదయం మోత్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ధర్మేందర్‌రెడ్డికి డాక్టరేట్



నల్లగొండ, మోత్కూరు, డిసెంబరు 31: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన నేవూరి ధర్మేందర్‌రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వహణ, అమలు తీరుపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. నేవూరి ధర్మేందర్‌రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్వీ రాష్ట్ర యువజన విభాగ నాయకుడిగా పని చేస్తున్నారు. ధర్మేందర్‌రెడ్డికి డాక్టరేట్ రావడంపై వారి కుటుంబసభ్యులు, గ్రామస్థులు, మిత్రులు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 31: తమిళనాడులోని వెల్లూర్‌లో డిసెంబరు 25 నుంచి 30వ తేదీ వరకు జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి చెస్ పోటీల 14ఏళ్ల బాలిక విభాగంలో తెలంగాణ విద్యార్థిని (రంగారెడ్డి జిల్లా)శివంశిక ఆరు పాయింట్లు సాధించి బంగారు పతకం సాధించడం పట్ల ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రాంరెడ్డి, తెలంగాణ జట్టు కోచ్, మేనేజర్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కోసనం కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. అండర్-19 బాలికల విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన దివ్యభవాని తృతీయ స్థానంలో నిలిచిందని తెలిపారు.

కబడ్డీ పోటీల కోఆర్డినేటర్‌గా రాజు

నిడమనూరు, డిసెంబరు 31: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఈ నెల 7 నుంచి నిర్వహించనున్న అండర్-17 బాలుర, బాలికల జాతీయస్థాయి కబడ్డీ పోటీల టెక్నికల్ కోఆర్డినేటర్‌గా నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుంభం రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కబడ్డీ పోటీలకు ఆయన సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



లారీ నుంచి పడిన ఐరన్ పైపులు

గరిడేపల్లి, డిసెంబరు 31: సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఆదివారం రాత్రి ప్రమాదం తప్పింది. కోదాడకు చెందిన లారీ కర్నాటక నుంచి ఐరన్ పైపులలోడుతో విజయవాడకు వెళ్తుంది. గరిడేపల్లి మండల కేంద్రంలోని మిర్యాలగూడ, కోదాడ ప్రధాన రహదారిపై చౌరస్తా వద్దకు రాగానే యూటర్న్ వద్ద ఆటో అడ్డు రాగా లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో లారీకి కట్టిన తాడు తెగిపోయి లారీలో ఉన్న ఐరన్ పైపులు రోడ్డు మొత్తం పడిపోయాయి. లారీ వెనకాల నుండి బైక్‌లు కానీ, ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. పైపులు రోడ్డుపై పడడంతో ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. ఘటన జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై రోడ్డుపై పడిన ఐరన్ పైపులను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కమ్మేసిన మంచు.. ఇబ్బందిపడిన వాహనదారులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం పూట రెండు గంటల పాటు జాతీయ రహదారితోపాటు ప్రధాన వీధుల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాదచారులతోపాటు వాహనదారులు భయం..భయంగా వెళ్లాల్సి వచ్చింది. లైట్లు వేసుకున్నా కూడా వాహనాలకు రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొంది.

● చౌటుప్పల్ టౌన్, నల్లగొండ





నల్లగొండ, చౌటుప్పల్‌లో వాహనాల లైట్ల వెలుతురులో ప్రయాణిస్తున్న వాహనదారులు

బాధితురాలికి సెల్ ఫోన్ అప్పగింత

భువనగిరి రూరల్, డిసెంబరు 31: సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్న మహిళకు ఆదివారం అప్పగించినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. కేరళకు చెందిన ఆర్యసతీష్ బీబీనగర్ ఎయిమ్స్ వద్ద విధులు నిర్వహిస్తూ ఆర్టీవో ఆఫీసుకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఆమె భువనగిరి శివారులోని అనంతారం వద్ద తన ఫోన్‌ను పోగొట్టుకున్నారు. వెంటనే భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గతనెల 7న ఫిర్యాదు చేశారు. అయితే ఆమె మొబైల్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా ఫోన్ ఆచూకీని కనిపెట్టి ఆమెకు అందజేశారు. అయితే ఫోన్ ఆచూకీ కోసం కృషి చేసినా కానిస్టేబుళ్లు ఎస్ నరేందర్, జి చెన్న కేశవులును ఎస్ఐ అభినందించారు.

అధికారులు అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతిరెడ్డి

మోతె, డిసెంబరు 31: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే క్రమంలో అధికారులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం మోతె మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముప్పాని ఆశ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగా అధికారులు ప్రజలను ఇబ్బంది పెట్టినా, పథకాల అమలులో అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గకుండా పార్టీలకతీతంగా పోలీసులు బాధితులకు న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలుచేసే విధంగా అధికారులు పనిచేయడంతో పాటు, ఈ పథకాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. . అనంతరం ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాలు, చేపట్టిన పనుల వివరాలను సమావేశంలో చదివివినిపించారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని వివిధ గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. రాఘవాపురం గ్రామం పశువుల ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని ఎంపీటీసీ మద్ది మధుసూదన్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి మండలానికి రావడంతో పద్మావతిని నాయకులు సన్మానించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముప్పాని ఆశ శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ పందిళ్ల పల్లి పుల్లారావు, తహసీల్దార్ ప్రకాశరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో హరిసింగ్, సూపరింటెండెంట్ వెంకటాచారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మైనంపాటి గుర్వారెడ్డి, కీసర సంతోష్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, కోడె వాసు, రాములునాయక్, సాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

కావలెను

★ ప్రముఖ ప్రైవేటు బ్యాంకుల అనుబంధ సంస్థ యందు పని చేయుటకు టెలీకాలర్స్, టీం లీడర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం మరియు ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. ఖాళీలు: 06, అర్హత: ఇంటర్, డిగ్రీ. మరిన్ని వివరాలకు సంప్ర॥ సెల్:8897325913.

AJY_

PLOT FOR SALE

★ 500 Sq. Yards (120 x 60) East Facing 30 feet సూర్యనగర్ కాలనీ, నల్లగొండ నందు అమ్మకమునకు కలదు. ఆసక్తి గల సంప్ర॥ 6303025110, 9888808442.

AJY_622363

FLAT FOR SALE

★ HAYATHNAGAR : Walkable Distance Vijayawada Highway Beside Bus Stop, Sup. Luxurious 3 BHK Flats, Ready to Move, 2 side 30" Rd. Ph: 9247326642 / 9849801477

AJH-3443

జిల్లా వార్తలకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1K7b2pE లో చదవండి.

బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా సైదులు

ఆత్మకూర్ (ఎస్), డిసెంబరు 31: బీఎస్ ఎన్ఎల్ టెలి కాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మండల పరిధిలోని గట్టికల్ గ్రామానికి చెందిన సంధ్యాల సైదులు నియమితులయ్యారు. దశాబ్ద కాలంగా ఆయన బీజేపీ జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

సమస్య పరిష్కరించాలి

దేవరకొండ: డీజిల్ మైలేజ్ పరిమితి తగ్గించి కిలోమీటర్‌కు రూ.3 రూపాయలు పెంచాలని అద్దె బస్సుల యాజమానులు దేవరకొండ ఆర్టీసీ డీఎం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల సరిపడా బస్సులు లేక అద్దె బస్సులపై పరిమితికి మించి ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో డీజిల్ మైలేజ్ పడి పోవడం స్పేర్ పార్ట్స్ చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్ మైలేజ్ పరిమితి తగ్గించి కిలోమీటర్‌కు 3 రూపాయలు పెంచాలని , కోరారు. లేనిచోవ తేదీ నుంచి అద్దెబస్సులు నిలిపివేస్తామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి

మునగాల రూరల్, డిసెంబరు 31: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం మునగాలలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల ద్వారా ప్రతి పేదవాడికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అన్ని శాఖలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండలం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. మండల సమావేశాలకు హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీవోపై చర్యలు తీసుకోవాలి: ప్రజాప్రతినిధులు

గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు చేయాలంటే లంచం డిమాండ్ చేస్తున్న ఎంపీవో భూపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మునగాల సర్పంచ్ చింతకాయల ఉపేందర్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు చేసే విషయంలో భూపాల్‌రెడ్డి ఇబ్బందులు పెడుతూ లంచం అడుగుతున్నారని, లంచం ఇవ్వనిదే ఏ బిల్లూ చేయడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎంపీవో భూపాల్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని మునగాల సర్పంచ్ ఉపేందర్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీవో వైఖరితో ఆరు నెలల నుంచి అభివృద్ధి పనులు కూడా చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఓచర్లు చేయాలన్నా, మస్టర్లు చేయాలన్నా లంచం ఇవ్వనిదే పనికావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ అధికారిని బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో రాములునాయక్, సాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో కోదాడను ముందు వరుసలో ఉంచుతా

కోదాడ: అభివృద్ధిలో కోదాడ నియోజకవర్గాన్ని జిల్లాలో ముందు వరుసలో ఉంచుతానని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకుడు యర్నేని బాబు నివాసంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. నియోజకవర్గ ప్రజలు కొత్త సంవత్సరంలో అన్ని రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యర్నేని కుసుమ, వెంకటప్పయ్య, మండలపు శేషు, రావెళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మునగాలలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మట్టిని తరలిస్తున్న వారిపై కేసు, వాహనాల సీజ్



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

మఠంపల్లి, డిసెంబరు 31: చౌటపల్లి ఊర చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న పలువురిపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు మఠంపల్లి ఎస్‌ఐ సీహెచ్ బాలకృష్ణ తెలిపారు. చౌటపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు చెరువు నుంచి అక్రమంగా ఎక్స్‌కవేటర్ల ద్వారా మట్టిని తవ్వి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని ఐబీ ఏఈ తుమ్మల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారన్నారు. పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వాహనాలను సీజ్ చేయడంతో పాటు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విగ్రహాలను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



ధ్వంసమైన విగ్రహాలు

అనంతగిరి, డిసెంబరు 31: మండలంలోని వాయిలసింగారం గ్రామంలో పంచాయతీ కార్యాలయంల ఎదురుగా ఉన్న పలు విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వెంపటి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడువెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మహాత్మా గాంధీ, బాబు జగ్జీవన్‌రాం, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని తెలిపారు. అదే విధంగా గ్రామంలోని కూరగాయల మార్కెట్‌లో రూ.20వేల విలువైన కూర గాయలను చోరీ చేశారన్నారు. ఈ ఉదంతాలపై అఖిల పక్షం ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ఇంటింటికీ ఆయోధ్య రామాలయ అక్షింతలు



తిరుమలగిరిలో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

పెన్‌పహాడ్, డిసెంబరు 31: ఆయోధ్య రామమందిరం అక్షింతలను మండలంలోని నాగులపాటిఅన్నారం గ్రామంలో భక్తులు ఆదివారం పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయోధ్య రామమందిరం జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కో-ఆర్డినేటర్లు కీతా సరోజనమ్మ, రంగినేని వనమ్మ మాట్లాడుతూ అక్షింతలను అంజనేయస్వామి ఆలయం, రామాలయంలో భద్రపరుస్తున్నామని, అక్షింతలను ప్రతి గ్రామంలో ఈ నెల 18 నుంచి 20వరకు ఇంటింటికీ శ్రీరాముడి ఫొటోలతో పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 22న ఆయోధ్య రామాలయం ప్రారంభం సందర్భంగా ప్రతి ఒక్కరి ఇంటి ముందు దీపాలను వెలిగించాలన్నారు. కార్యక్రమంలో నారబోయిన అప్పయ్య, బొలిశెట్టి భిక్షమయ్య, ధనియాకుల శ్రీనివాస్, అభిలాష్, దొంతగాని నాగయ్య, బాదె భిక్షం, శ్రీరాముల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: ఆయోధ్య రామమందిరయ అక్షింతలు తిరుమలగిరికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా అక్షింతలకు ఆదివారం మునిసిపల్ కేంద్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మునిసిపాలిటీ కేంద్రంతో పాటు గ్రామాలకు పంపాల్సిన అక్షింత లను ఇన్‌చార్జులకు అందజేశారు. అనంతరం భక్తులు రామ నామస్మరణ, భజనలు చేసుకుంటూ అక్షింతలను ఊరేగింపుగా గ్రామాలకు తరలించారు. కార్యక్రమంలో ధర్మజాగరణ సమితి సంస్థ సభ్యుడు శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు శ్యాంశెట్టి శ్యాం, ఆర్ఎస్ఎస్ జిల్లా సభ్యులు మధు, అశోక్, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీధర్, నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మోతె: అయోధ్య రామమందిర అక్షింతలను మండలంలోని విభలాపురంలో రామ భక్తులు, అయ్యప్ప భక్తులు కలిసి ఇంటింటికీ పంపిణీ చేశారు.

హుజూర్‌నగర్ రూరల్: అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ అక్షింతలను అక్షింమండలంలోని లక్కవరం గ్రామంలో భక్తులు ఊరేగించారు. పట్టణంలోని రామాలయం నుంచి లక్కవరం గ్రామం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. లక్కవరం గ్రామంలో ఈ నెల 3,4 తేదీల్లో ప్రతి ఇంటికీ అక్షింతలను పంపిణీ చేస్తామని భక్తులు చామకూరి గురుపాదం, సతీష్, మధు, శ్రీనివాస్, సైదులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి సహస్ర నామ పారాయణం

మేళ్లచెర్వు, డిసెంబరు 31: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భూనీల సమేత వేంకటేశ్వరస్వామికి విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం కుంకుమ పూజ, సప్తహారతులు, తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సుదర్శనం ప్రసాద్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ధనుర్మాస వేడుకలు



బూరుగడ్డ దేవాలయంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్, డిసెంబరు 31: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం 15వ పాశుర తాత్పర్యం నిర్వహించారు. అనంతరం గోదాదేవికి ప్రత్యేక పూజలు, గుడిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, గుండు సైదులు, కుచేల్, హరీష్, మనోహర్, రామస్వామి, నరసింహారావు, గురవయ్య, పూర్ణ, మల్లికార్జున్, గోవిందరెడ్డి, కిరణ్, రమేష్, గోపాల్, కనకయ్య, లింగయ్య, రాగం లింగయ్య పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా నృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, డిసెంబరు 31: రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా పేరుగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం నృసింహుని నిత్య కల్యాణాన్ని పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

'వీరారెడ్డి ఆశయాలను సాధించాలి'

నాగారం, డిసెంబరు 31: విద్యార్థి ఉద్యమ నాయకుడుయానాల వీరారెడ్డి ఆశయాలను సాధించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య కోరారు. ఆదివారం నాగారం ఎక్స్ రోడ్‌లో వీరారెడ్డి 33వ వర్ధంతి సభను నిర్వహించారు. వీరారెడ్డి స్తూపం వద్ద ఎర్ర జెండాను వర్ధమానుకోట గ్రామ కార్యదర్శి జాజుల సామేల్ ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, కార్యదర్శి బోడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.సైదులు, పీడీఎస్‌యూ నాయకులు పోలెబోయిన కిరణ్‌కుమార్, బయ్యం లింగయ్య, డి.ధనుంజయ, కాడారి సైదులు, పేరబోయిన అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ నాయకుడు యానాల వీరారెడ్డి ఆశయాలు సాధించాలని పీడీఎస్‌యూ నాయకుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. వీరారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దోపిడి లేని సమాజం కోసం యానాల అహర్నిశలూ కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో భరత్, రహీం, మహష్, వినయ్, నవీన్, స్వాతి, మౌనిక, శైలజ పాల్గొన్నారు.

కరోనా ప్రబలకుండా పనిచేయాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

మఠంపల్లి, డిసెంబరు 31: కరోనాతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎంపీపీ పార్వతి అన్నారు. ఆదివారం మఠంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను అధికారుల తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో పాటు ఆరు గ్యారెంటీల పథకాలపై, ప్రజా పాలనపై అధికారులు సభలో సభ్యులకు వివరించారు. సమావేశానికి గైర్హాజరవుతున్న అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో జానకిరాములును ఎంపీపీ ఆదేశించారు. ప్రభుత్వం జడ్పీహెచ్‌ఎస్‌కు మంజూరు చేసిన సైన్స్ పరికరాలను హెచ్ఎంలకు ఎంపీపీ అందజేశారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, ఎంపీడీవో మామిడి జానకిరాములు, ఎంఈవో ఛత్రునాయక్, ఎంపీవో అంజనేయులు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై సమాచారం ఇవ్వాలి

మండలంలో విడుదలవుతున్న నిధులపై అధికారులు సమాచారం ఇవ్వాలని భీల్యానాయక్‌తండా, మఠంపల్లి ఎంపీటీసీలు శౌరినాయక్, ప్రభుదాసు కోరారు. తమకు నిధుల మంజూరుపై సమాచార హక్కు ద్వారా దరఖాస్తు చేసి రెండేళ్ల దాటినా, నేటికీ సమాచారం ఇవ్వకపోవటానికి కారణం చెప్పా లంటూ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు నేలపై కూర్చొని నిరసన తెలిపారు. . ఈ సందర్భంగా ఎంపీటీసీలు, ఎంపీడీవో మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగి గందరగోళ పరిస్థితి నెలకొంది. స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని ఎంపీటీసీలు స్పష్టం చేయడంతో సమావేశానికి కొంత అంతరాయం ఏర్పడింది. దరఖాస్తు చేసుకున్న ఈ నెల 10వ తేదీ లోపు పూర్తిస్థాయిలో సమాచారం ఇస్తామని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ఆందోళనను ఎంపీటీసీలు విరమించారు.



నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

ఎన్‌ఆర్‌ఐల అభ్యున్నతికి చంద్రమౌళి కృషి



చంద్రమౌళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలు పార్టీల నాయకులు

హుజూర్‌నగర్, డిసెంబరు 31: ప్రవాస భారతీయుల అభ్యున్నతికి ఎన్‌ఆర్‌ఐ దివంగత నలమల చంద్రమౌళి చేసిన కృషి అభినందనీయమని టీడీపీ నాయకుడు చావా సహదేవరావు, మాజీ సర్పంచ్ గొట్టె రామయ్య కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు కొనియాడారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పట్టణానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ చంద్రమౌళి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మట్లాడారు. హుజూర్‌నగర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రస్థాయికి ఎదిగిన చంద్రమౌళి హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన పలువురికి ఉపాధి కల్పించాడని కొనియాడారు. కార్యక్రమంలో వ్యాపారి నలమల సుబ్బారావు, రౌతు వెంకటేశ్వరరావు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, శాఖమూరి రవి, సతీష్, నాగేశ్వరరావు, డాక్టర్ రావూరి శివప్రసాద్, అంజయ్య, ముత్తినేని వెంకటేశ్వరరావు, కట్టా గోపాలరావు, శివరాం, మట్టపల్లిరావు, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, జాని, సైదా, ఓర్సు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేరేడుచర్ల వాసవీ, వనిత క్లబ్‌లకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న వాసవీ, వనిత క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, డిసెంబరు 31: ప్రజా సేవకు గుర్తింపుగా నేరేడుచర్ల వాసవీ, వనిత క్లబ్ సభ్యులు పలు అవార్డులు అందుకున్నారు. డిస్ట్రిక్ట్ వి104 అంతర్జాతీయ స్థాయిలో ఫస్ట్ సూపర్ బెస్ట్ అవార్డు గెలుచుకున్నట్లు వాసవీ, వనిత క్లబ్ సభ్యులు తెలిపారు. విజయవాడలోని ఏప్లస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన 2023అవార్డుల ప్రదానోత్సవంలో వాసవీ, వనిత క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, పొలిశెట్టి సంధ్యకు అవార్డులను వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలకుర్తి గాయత్రి, ఇరుకుల రామకృష్ణ అందజేశారు. వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి ఇంటర్నేషనల్ బెస్ట్ క్యాబినెట్ ట్రెజరర్ అవార్డు అందుకున్నారు. రీజియన్ స్థాయిలో, ఇంటర్నేషనల్ స్థాయిలో 180 అవార్డులు గెలుచుకున్న వాసవీ, వనిత క్లబ్ సభ్యలను వాసవీ క్లబ్ గవర్నర్ వంగవీటి వెంకటగురుమూర్తి, గరిణె అరుణకుమారి, కందిబండ వాసంతి, రాచకొండ శ్రీనివాసరావు, ఈగా భాగ్యలక్ష్మి, గజ్జల కోటేశ్వరావు, పొలిశెట్టి అశోక్, రాచకొండ రామ్మోహన్‌రావు, పాల్వాయి రమేష్, కందిబండ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ

నేరేడుచర్ల పట్టణ పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఆవుల కృష్ణయ్య, తిరుపతమ్మకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నెల రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యడవెల్లి సత్యనారాయణరెడ్డి, బట్టు మధు, జిలకర రామస్వామి, లక్ష్మారెడ్డి, విశ్వనాథ్, లుకాస్, రాపోలు నవీన్, క్రాంతి, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చయ్యకు నటరత్న ఎన్టీఆర్ పురస్కారం

మఠంపల్లి, డిసెంబరు 31: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సినీ, రంగస్థల కళాకారుడు గుంటి పిచ్చయ్యకు నటరత్న ఎన్టీఆర్ పురస్కారం లభించింది. తిరుపతికి చెందిన సుబ్బరాజు నాట్య కళాపరిషత్ 60వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అశ్వం అవార్డుల ప్రధానోత్సవంలో పిచ్చయ్యకు అవార్డును అందజేశారు. ఉత్తమ అభినయానికి విజయవాడలో ఆదివారం జరిగిన అభినందన సభలో పిచ్చయ్యకు నటరత్న ఎన్టీఆర్ అవార్డును నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా పిచ్చయ్యను మండల కళాకారులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న గుంటి పిచ్చయ్య



సూర్యాపేట టౌన్: సూర్యాపేట పూర్వ మిత్ర మండలి నూతన కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఉప్పు సత్యనారాయణ, అధ్యక్షుడిగా నల్లకుంట్ల అయోధ్య, ఉపాధ్యక్షుడిగా నల్లపాటి అప్పారావు, ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్, సహాయ కార్యదర్శులుగా అరుణజ్యోతి, సైదులు, కోశాధికారిగా నాతి సవిందర్, సాంస్కృతిక కార్యదర్శిగా మాదంశెట్టి వీరయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎమ్మెల్యేమ్మ, వీరబోయిన సుందరయ్య, వంగపల్లి లచ్చయ్య, సాంబమూర్తి, వెంకన్న ఎన్నికయ్యారు.

● ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని మోతె తహసీల్దార్ పందిరి యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలోని సఖి సెంటరు ఆవరణలో వాకర్స్ క్లబ్, హెల్తీపై ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో హెల్తీపై ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మతకాల చలపతిరావు, వాకర్స్ క్లబ్ సభ్యులు రేపాల శ్రీనివాస్, డాక్టర్ మతకాల అపర్ణ, మంజుల, వళ్లెం శేఖర్, నెమ్మాది వెంకటేశ్వర్లు, అంకతి వెంకన్న, వీరారెడ్డి, ఉదయ్, నర్సయ్య, మామిడి సైదులు, మురళి, వెంకన్న, మందాడి సైదులు, వెంకటరెడ్డి, ప్రదీప్, సంతోష్ పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా వీరబోయిన లింగయ్యయాదవ్‌ను నియమించారు. ఆదివారం హైదరాబాద్‌లో లింగ య్యయాదవ్‌కు నియామకపత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా లింగయ్యయాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, సత్యం, అంజి, ఉదయ్ పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎస్.హమీద్‌ఖాన్, వీర్లాల రాములు, టి.లక్ష్మీకాంతరెడ్డి, భాస్కరాచారి, కృపాకర్‌రెడ్డి, గట్ల సోమయ్య, వీరయ్యపాల్గొన్నారు

●ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు అన్నారు.జిల్లా కేంద్రంలోని ఆసంఘ కార్యాలయంలో టీఎస్-యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్లను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్-యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య, ఎస్.అనిల్‌కుమార్, జె.యాకయ్య, అరుణభారతి, వెంకటయ్య, దామోదర్, పాపిరెడ్డి, నాగేశ్వర్‌రావు, ఆడం, రమేష్, శ్రీనివాసాచారి, రవీందర్, ఉదయభాస్కర్, ఆంజనేయులుపాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ దేవాలయంలో కుంకుమ పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 51శ్రీ చక్రాలతో కుంకుమ పూజలు ప్రారంభించినట్లు ఆలయ ఈవో కుశలయ్య తెలిపారు. పలువురు దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు.ఆలయంలో ప్రతి ఆదివారం, గురువారం కుంకుమ పూజలు నిర్వహిస్తామనానరు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నగేష్, సైదులు, శ్రీనివాస్, వేదపండితులు పాల్గొన్నారు.

● ప్రజాపాలన గ్రామసభల్లో దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు వీల్‌చైర్లను అందుబాటులో ఉంచాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జహీర్ బాబా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దరఖాస్తు ఫారంలో దివ్యాంగుల కాలం కల్పించాలని, సదరన్ క్యాంప్‌లో 40శాతం దివ్యాంగులుగా నిర్ధారించిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

పెన్‌పహాడ్: గోదావరి జలాలను ఈ నెల 8నుంచి విడుదల చేస్తున్నట్లు జిల్లా ఈఈ ధీరావత్ భద్రునాయక్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని అన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందే పరిస్థితి లేదన్నారు.

హుజూర్‌నగర్: అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని దక్షిణ మధ్య రైల్వే జోనల్ మెంబర్ యరగాని నాగన్నగౌడ్ అన్నారు. మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని శివాలయం వద్ద రూ.4లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిమట చినసైదులు, యరగాని భిక్షం, గడ్డం నాగయ్య, సర్పంచ్ సలీమా, ఉప సర్పంచ్ ఆదెమ్మ, మేకపోతుల వెంకయ్య, నరసింహారావు, గురవయ్య, రాము,సైదులు, వీరబాబు, ఆవుల నరేందర్, వెంకటి,మట్టపల్లి, గోపయ్య పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ మండలంలోని మాధవరాయనిగూడెంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు మోదాల సైదులు, గడ్డం అంజయ్య, మేకల సైదులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నందిగామ శ్రీను, మోదాల వెంకన్న, సావిత్రి, రాజారావు, అంజయ్య,వెంకటమ్మ,పాపయ్య,వెంకటేశ్వర్లు, లింగయ్య, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: సీపీఐ అమరవీరుల ఆశయాలు సాధించాలని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డా నారాయణరావు అన్నారు.సీపీఐ నేత పశ్య వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన గొప్ప నాయ కుడు వెంకటరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి పశ్య పిచ్చమ్మ, దేవరం సుజాత, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మఠంపల్లి: వ్యవసాయ కార్మిక సంఘం(వ్య.కా.స.) సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ఇంటి స్థలంతో పాటు, ఇల్లు మంజూరు చేయాలని, ఉపాధిహామీ పథకంలో 200రోజుల వరకు పని రోజులను పొడిగించాలని, అర్హులందరికీ నూతన రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్య.కా.స. జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సీపీఐ మండల కార్యదర్శి అమరవరపు పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: నూతన సందర్భంగా మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయంలో శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఫాదర్ మార్టిన్ పసల ప్రారంభించారు. ఎనిమిది మంది విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జి.పవన్, కార్యదర్శి టి.బాల్‌రెడ్డి సంయుక్త కార్యదర్శులు ఎస్.రాజేష్, కోశాధికారి కె.కిరణ్, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శులు కె.రంజిత్, జి.అఖిల్, మనీష్ పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పోలీసులకు, జర్నలిస్టులకు, హెల్త్ ఇన్సురెన్స్ ఉన్న వారికి, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆపరేషన్లు చేయడంతో పాటు ఆరోగ్య శ్రీ, ఆహార భద్రత కార్డు ఉన్న వారికి ఉచితంగా చెకప్‌లు చేసి అవసరమైనవారికి ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

మోతె: అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు సహకరించడం అభినందనీయమని బజ్జూరి జ్యోతి అన్నారు. అండు శ్రీరాములు జ్ఞాపకార్థం మండల కేంద్రంలో ఉన్న రెండో అంగన్‌వాడీ కేంద్రానికి మీసేవ నిర్వాహకుడు మల్లేష్ సీలింగ్ ఫ్యాను, ఉప సర్పంచ్ దోసపాటి రాములు బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దోసపాటి పద్మ, రోజ, మోహినమ్మ, విజయలక్ష్మి, గోవిందమ్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి: రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను తిరుమలగిరి మునిసిపాలిటి కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు సారంగుల నర్సయ్య, మంద పద్మారెడ్డి, మద్దూరి రాములు, జయపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి,పాల్గొన్నారు.

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ టీ27 యూనియన్ అనంతగిరి మండల అధ్యక్షుడిగా కిన్నెర సుధాకర్‌ను ఎన్నుకున్నారు. కోదాడ నియోజకవర్గం డివిజన్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కందిబండ వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు సురేష్, ఎస్‌కే గులాం హుస్సేన్, జగీత్, సబ్ డివిజన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి,: మండలంలోని వెలుగుపల్లికి చెందిన రెడ్డిమళ్ల రాజేష్ ఇంజనీరింగ్ పూర్తి చేసి వీఎల్ఎస్ఐ ట్రైనింగ్ పొందడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా, ఫుడ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రాజీవ్‌సాగర్ చేయూత నందించారు. ట్రైనింగ్‌కు రూ.1.20లక్షలు అవసరం కాగా, ప్రతి నెలా రూ.20వేల చొప్పున ప్రతి నెలా అందజేస్తామని హామీ ఇచ్చి, మొదట విడతగా రూ.20వేలను ఆదివారం అందజేశారు.